పురుషాహంకారంతో భార్యని దూరంచేసుకున్న అతడికి చివరికి మిగిలిందేమిటి?

# రెండో మలుపు

ఆసం శ్రీనివాస్

కథ

నేనొక దుర్మార్గుణ్ణి...

నీచుణ్ణి!

అర్ధరాత్రివరకు బారుల్లో తప్పతాగి, ఆ తర్వాత నచ్చిందాన్తో హోటల్లో గడిపి ...

ఏ తెల్లవారు జామునో ఇంటికి చేరి ...

నాకోసం గడప బయటే ఎదురుతెన్ను లు చూడనందుకున్నా...

'ఇంతాలస్యమయిందేం'' అని అడగనం దుకున్నా...'

మా ఆవిడ్ని తన్నే మగమహారాజుని!!

నాకోసం ఎదురుచూడలేదన్న కసీ, నేను ఆలస్యంగా వచ్చినా తనకేమీ బాధలేదన్న ఉక్రోషమూ నా అహాన్ని దెబ్బతీసేవి.

తనను పట్టించుకోలేదన్న కారణం ఆమె అహాన్ని దెబ్బతీస్తూ వుండొచ్చుగాక, అది నాకవసరమైన విషయం.

నేను మగ మహారాజుని కానీ,

ఆవిడ మహారాణి కాదు!

అలాంటి నీచ, నిర్భాగ్య, నికృష్ట వ్యక్తిత్వ మున్న నేను...

నేనే, స్వయంగా మాయావిణ్ణి వేరే పెళ్లిచేసుకోమని చెప్పాలనుకున్నాను.

'ఎందుకలా చెప్పాలనుకున్నావురా నీచు డా!' అని ఇందులోకూడా నా 'మగ' తత్వాన్ని శంకిచొద్దు మీరు.


మనస్ఫూర్తిగానే అనుకున్నాను.

▶ ◆ ◀

నీతూ అంటే నాకిష్టం!

ఆమె ఒక క్యాబరే డాన్సర్.

ఆమెకూడా నేనంటే ఇష్టమని చెప్పిం ది. నేనునమ్మినట్టు నటించాను. ఆమెకు నా



నెనకున్న డబ్బంటే ఇష్టమని తెలుసు. విచిత్రమేమంటే నాకది తెలుసన్న విషయమూ ఆమెకు తెలుసు.

అయినా నన్నిష్టపడ్డానని చెప్పింది. కావలసింది శరీరాలకు సుఖమే అయినప్పుడు... మధ్యలో మనసు ప్రసక్తి దేనికని నేనామెతో అనలేదు. ఇద్దరిలోనూ ఆత్మవంచన తప్పనిసరైనప్పుడు అది బయటికి వెళ్లగక్కే అవసర

ంగా 'రిలేషన్' పాడుచేసుకోవడమెందుకు.

నీతూ సెక్స్‌లో బాగా పాల్గొంటుంది. కొత్త పాఠాలు నేర్పుతుంది. తెలివిగలది. ఎంత తెలివైందంటే నా శరీరం పతాకస్థాయిలో వున్నప్పుడు సడన్‌గా బ్రేక్‌వేసి తనకు కావలసిన వస్తువులు... అప్పుడే, ఆ క్షణంలోనే అత్యంత అవసరమైనట్టు లిస్ట్ చదువుతుంది.

ఏ మగాడైనా ఆ క్లైమాక్స్‌లో ఏం అనగలడు...

ముందు శుభం పడాలనుకుంటాడు. నేనూ అదే చేస్తాను.

నీతూ పరిచయమయ్యాక నేను ఏ ఆడపిల్లవంకా కన్నెత్తి చూడలేదు. నీతు ఇచ్చే సుఖం నాకు చాలనిపించేది. అందుకే, ఆమె అడగకుండానే డబ్బూ, నగలూ, కానుకలూ అందించేవాడిని.

అయితే ఆమె నన్నడగకుండా హోటల్ మేనేజర్ కుదిర్చిన విటులదగ్గరకు విలాసంగా వెళ్లిపోయేది. ఆ మరునాడు మేం కలుసుకున్నాక అంతకుముందు రాత్రి తన ప్రతాపంతో ఎవడిని, ఎలా బెదరగొట్టిందీ కథలుగా చెప్పి నవ్వేది.

నేనా సమయంలో బదులుగా నవ్వాలో, కోపగించుకోవాలో, ఏవగించుకోవాలో, ఏం చేయాలో తెలిసేది కాదు. నిర్లిప్తంగా విని ఊరుకునేవాడిని.

నిజమే! వేరే వాళ్లతో సంబంధాలు పెట్టుకోకూడదని గట్టిగా వాదించడానికి నీతూ నా భార్యకాదు.

భార్యంటే... నా భార్య నర్మదే!

మర్మమేమీ తెలీదామెకి. అయినా భార్య దగ్గర...

రిపెంట్ అవడమూ, రియలైజ్ అవడమూ... ఆ తర్వాత కన్నీళ్లతో క్షమాపణలు అడగడమూ మగమహారాజులకి ప్రిస్టేజ్ కొశ్చన్. సో, నేను ఎప్పుడూ నా భార్య కళ్లల్లో నా పాపాల్ని ప్రక్షాళన చేసుకోవాలనుకోలేదు.

నీతూ పరిచయమయ్యాక ఏ నాలుగు రోజులకోసారో ఇంటికి వెళ్తున్నాను. అయినా ఆమె ఏమీ ప్రశ్నించదు. మౌనంగా పనులన్నీ చేసిపెట్టి తన గదిలోకి వెళ్లి తలుపు పెట్టి పడుకుంటుంది.

ఆవిడగారికింత ఇది అయినపుపడు మగవాడిని నా కోరికలు తీరడానికి దారుల్లేవనా... నేవెళ్లి ఆమెను బతిమాలటం, పడుకోమనడం, కాళ్లు పట్టుకోవడం ఇలాంటివేమీ చచ్చినా చేయను.

మా ఇద్దరి మధ్యా శారీరక సంబంధం నీతూ పరిచయం కాకముందే దూరమైంది. ఉన్నదల్లా బాధ్యత. భర్తగా నేనామెకు అన్నీ సమకూరుస్తాను.

సంతోషం అంటారా అది నా చేతుల్లో లేదు. నేనామెకు ఏ విధంగానూ ఇవ్వడంలేదు.

ఇదిగో... ఇలా ఆలోచిస్తున్నప్పుడే... సరిగ్గా ఆ క్షణంలోనే నాలోనే పురుషాహంకారి నిద్రలేస్తాడు. 'భార్యగురించి ఆలోచించి ఆ కాస్త సమయాన్ని వృధా చేసుకుంటున్నావ్. నువ్వసలు మగజాతిలో పుట్టాల్సినవాడివే కాదం'టూ విమర్శిస్తాడు.

కథంతా ...

రెండు తోకల పిట్టకి మల్లే సాగిపోతోం

టే ఇక రసవత్తరం అంటూ ఏముంటుందని ది స్వీట్ రైటర్ బ్రహ్మ అనుకుని వుంటాడు. అందుకే అనుకోని మలుపులు 'రెండు' ... కేవలం రెండే రెండు సృష్టించాడు.

మొదటిది — ముఖ్యమైందీ ముందు చెప్తాను...

అది —

నీతూద్వారా నాకు ఎయిడ్స్ సోకడం!

▶ ◆ ◀

అనుకోని మలుపు...

పురుషాహంకారంపై విధి సాధించిన గెలుపు...

నీతూపట్ల నాకేమీ కోపం కలగలేదు. విధిపట్లా ద్వేషం పెంచుకోలేదు. విరాసక్తత... కేవలం నిరాసక్తతే మిగిలింది.

ఒంటరితనానికి అలవాటుపడ్డాను. ఆఫీస్‌లోనో, లేదా హోటల్ గదిలోనో ఎక్కువగా గడిపేవాడిని. ఇంటికి వెళ్లాలంటే తప్పుచేసిన భావం. ఏ బలహీనక్షణంలోనో నర్మదతో కలిస్తే అనవసరంగా అమాయకురాలికీ ఈ వ్యాధి సోకుతుందన్న భయం.

కొన్నాళ్లు సెలవుపెట్టి ఊటీ వెళ్లాను.

ఒంటరిగా ఏ చెట్టుక్రిందో కూర్చుని మృత్యువు గురించి, వైరాగ్యం గురించి ఆలోచించేవాడిని. అలా నాలో అంతర్మధనం మొదలైంది.

నర్మదకి నేనేం చేయగలిగాను.

ఆమెను తప్ప, జీవితంలో నేనేం సాధించగలిగాను? అన్న ఆలోచన పెరిగింది.

నా ఆలోచనలన్నీ కలిసి —

చివరికి ఓ నిర్ణయంగా రూపుదిద్దుకున్నాయి.

అదే—

నా తర్వాత నర్మదని వేరే పెళ్లి చేసుకోమని చెప్పాలనుకోవడం!

ఆ ఆలోచన రాగానే, నేనెక్కువ కాలం ఊటీలో వుండలేకపోయాను. ఎలాగైనా నర్మదని ఒప్పించాలని ఇంటికి వచ్చాను.

అక్కడే నా కథ 'రెండో మలుపు' తిరిగింది!

▶ ◆ ◀

ఇంటికి తాళం వేసుంటే —

పక్కింటి వాళ్లనడిగాను.

వాళ్లు తాళం చెవితోపాటు ఓ కవరుకూడా తెచ్చిచ్చారు.

కవరు చింపి, ఉత్తరాన్ని తెరిచాను.

"... మీకు —

విలువైన నా జీవితాన్ని మీ సాహచర్యంలో నిస్సారం చేసుకున్నాను. ఎంతకాలమైనా ఇంతే అన్న నిజం నా స్వార్థం నన్ను చూసుకునేలా చేసింది. అందుకే నా ఆశలకూ, కోరికలకూ ఓ రూపం కల్పించడానికి సిద్ధపడ్డ ప్రసాద్‌తో నేను వెళ్లిపోతున్నాను. సమాజం దృష్టిలో ఇది 'లేచిపోవడం' అయితే అవనీగాక, నా దృష్టిలో నా కోసం నేనో 'కుటీరం' నిర్మించుకోవడం.

సెలవు

నర్మద..."

నా కళ్లవెంట రెండు కన్నీటి బిందువులు రాలిపడ్డాయి. నర్మద లేచిపోయినందుకు కాదు నా దుఃఖం. ఈ పనే ఎప్పుడో చేయనందుకు! నర్మద నాకన్నా ఒకడుగు ముందే వుంది. మెచ్యూరిటీ విషయంలో...! ('లేచిపోవడం మెచ్యూరిటీనా?' అని అడిగే వాళ్లకోసం కాదిది...!) ▶ ◆ ◀